శ్మశాన సమస్యకు...

శాశ్వత పరిష్కారం చూపాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు - కలెక్టరేట్ ఎదుట కెవిపిఎస్ ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

గోనెగండ్ల మండలం బి.అగ్రహారం గ్రామంలో నెలకొన్న శ్మశాన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, బీఎస్పీ నాయకులు బంగారప్ప, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్, కాటికాపరి, గుంతలు తీసే బేగరుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ మాట్లాడారు. బతికే బతుకు కోసం పోరాడే తాము, సచ్చిన తర్వాత పూడ్చే స్థలం కోసం కూడా పోరాడాల్సిన పరిస్థితి దాపురించిందని తెలిపారు. గత రెండు నెలలుగా గోనెగండ్ల మండలం బి.అగ్రహారం గ్రామంలో మనిషి చనిపోయిన ప్రతిసారీ రోడ్డుపై మృతదేహాన్ని పెట్టి ఆందోళన చేసి మరీ అధికారులను పిలిపించుకుని పూడ్చుకునే దుస్థితి నెలకొందన్నారు. ఈ దీనస్థితిని చూస్తున్న అధికారులకు, పాలకులకు సిగ్గనిపించడం లేదా అని విమర్శించారు. గ్రామంలోని సర్వే నెంబర్ 244లో 5.16 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమి ఉందని, అందులో రెండెకరాల భూమిని 30 ఎకరాలున్న భూస్వామికి డిపట్టా మంజూరు చేశారని తెలిపారు. ఆ డి పట్టాను పట్టుకొని కోర్టుకెళ్లి స్టే తెచ్చుకుంటే, స్టే ఉందంటూ జిల్లాస్థాయి అధికారులు సైతం మాట్లాడడం భూ కబ్జాదారులకు కొమ్ము కాయడం కాదా అని మండిపడ్డారు. స్టే ఉంటే పోలీసు, రెవెన్యూ సమక్షంలో పరిష్కరించుకోవాల్సింది పోయి, అర్ధరాత్రి దళితులు శ్మశానం చుట్టూ పాతుకున్న కంచెను తీసేసి, అందులో పెట్టుకున్న అంబేద్కర్ బోర్డుకు సిమెంటు అంటించి ఎవరి అండతో అవమానపరిచారని నిలదీశారు. కులం, డబ్బు, అధికారిక హోదా ఉంటే అలాంటి వారికి అధికారులు సాగిలాపడి పని చేస్తారని అనడానికి ఇది ఒక ఉదాహరణ అన్నారు. రెండు నెలలుగా శ్మశానం కోసం ఆందోళనలు జరుగుతున్నా స్థానిక గ్రామ కార్యదర్శి, అడ్మిన్, మండల ఇఒఆర్‌డిలు కౌంటర్ నోట్ పంపకపోవడం, దళితుల పట్ల ఉండే వివక్షకు ప్రత్యక్ష తార్కానమన్నారు. జిఒ నెంబర్ 1235 ప్రకారం ప్రతి దళిత పేటకు రెండెకరాల శ్మశాన స్థలం కేటాయించాలని ఉన్నా.. ఇప్పటిదాకా కేటాయించలేదని తెలిపారు. మరోవైపు భూస్వామి రామేశ్వర్ రెడ్డి తన భూమి పక్కన దళితుల శ్మశానం ఉంటే తన భూమికి ధర పలకదని అధికారుల ద్వారానే దళితులను తరిమికొట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. 'జీ హుజూర్' అంటున్న అధికారులు, శ్మశాన స్థలం కోసం ఆందోళన చేసినప్పుడు 44 సెంట్లు కేటాయించి, తిరిగి ఇప్పుడు వేరే చోట చూపిస్తామని అనడాన్ని ఎలా అర్థం చేసుకోవాలన్నారు. ఇది ఒక్క దళితుల సమస్య కాదని, ఊరందరి ఉమ్మడి శ్మశాన సమస్య అని తెలిపారు. తమ మృతదేహాలను పూడ్చేన స్థలాన్ని భూస్వాములకు కట్టబెట్టాలని చూస్తే సహించబోమని, పోరాటాన్ని రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా పలుస్తామని హెచ్చరించారు. అవసరమైతే చలో అగ్రహారం కార్యక్రమం నిర్వహిస్తామని, అందుకు మరింత అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా మహిళా నాయకులు విజయమ్మ, జయమ్మ, రాణెమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆర్.పెద్దబాబు, ఆంధ్రా గురుస్వామి, జిల్లా కమిటీ సభ్యులు చక్రపాణి, చిన్న రోశన్న, ఈశ్వరయ్య, ఏసన్న, దాసు, అగ్రహారం గ్రామస్తులు గిరిరాజు, రంగముని, గోపాల్, పెద్దయ్య, బలరాం, బజారి, చిన్న దస్తగిరి, వెంకటేష్, శీను, మునిస్వామి, మరో 50 మంది పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న నారా లోకేష్, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు

వందో రోజు జోరుగా

- బండి ఆత్మకూరు మండలంలో యువగళం
- లోకేష్‌తో కలిసి నడిచిన భువనేశ్వరి

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర శ్రీశైలం నియోజకవర్గంలో జనసంద్రం నడుమ జోరుగా సాగింది. ఆదివారం రాత్రి బోయరేవుల గ్రామం దగ్గర బస చేసిన నారా లోకేష్ సోమవారం ఉదయం ఏడు గంటలకు పాదయాత్రను ప్రారంభించారు. వంద రోజులు పూర్తి చేసుకోవడంతో నారా లోకేష్ తల్లి నారా భువనేశ్వరి యువగళం పాదయాత్రలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మోత్కూరు గ్రామం వద్ద వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా పైలాన్ ఆవిష్కరించారు. శ్రీశైలం నియోజకవర్గం ఇంచార్జి బుడ్డా రాజశేఖర్ రెడ్డి, పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మాజీ మంత్రులు అమర్నాథ్ రెడ్డి, ప్రతాపరెడ్డి, భూమా అఖిల ప్రియ పాదయాత్రలో నడిచి వచ్చి పైలాన్ ఆవిష్కరణలో పాల్గొన్నారు. అనంతరం బండి ఆత్మకూరు మండలంలోకి ప్రవేశించిన పాదయాత్రకు తెలుగుదేశం పార్టీ ఐఆర్‌సి మాజీ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి, మహానంది ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ కంచర్ల సురేష్ రెడ్డి, తాటికొండ బుగ్గ రాముడు, తెలుగు యువత శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు మల్లేశ్వర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు నందిపాడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి సిద్దయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున మహిళలు ఏకశిలా ఆంజనేయ స్వామి వద్ద ఘన స్వాగతం పలికారు. సంత జుటూరు గ్రామం మీదుగా ప్రజలతో అభివాదం చేస్తూ బస్టాండ్ వద్ద మహిళలతో పలకరిస్తూ ఉత్సాహంగా పాదయాత్ర సాగింది. అనంతరం మధ్యాహ్నం 42 చెంచు గూడెంల ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ముఖాముఖిలో బుడగ జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు తాటికొండ బుగ్గ రాముడు, పాటికొండ మహేష్, మద్దినేని శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచని సచివాలయాలు

- అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైనం...
- ఇబ్బందులు పడుతున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి-తుగ్గలి

మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సచివాలయాలు నిర్మాణాలు పూర్తి అయినప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. సచివాలయం ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 18 సచివాలయాలకు గానూ ఏడింటిని మాత్రమే సొంత భవనాలు నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఉన్న సచివాలయాలు అద్దె భవనాల్లో ఉండడంతో అద్దె చెల్లించలేక యజమానులు వాటికి తాళాలు వేసిన సందర్భాలు ఉన్నాయి. చెట్ల కిందనే సచివాలయాల ఉద్యోగులు తమ పనులను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే తుగ్గలి మండలం పరిధిలోని రాతన, చెన్నంపల్లి, రాంపల్లి, పెండేకల్లు, జొన్నగిరి, ఎర్రగుడి తదితర సచివాలయాలు పూర్తయ్యాయి. అయితే వాటిని ఇంతవరకు అధికారులు ప్రారంభించలేదు. ఇరుకు గదులలోని సచివాలయాల ఉద్యోగులు మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. కొన్ని సచివాలయాల్లో మరుగుదొడ్లు లేక మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మాత్రం సచివాలయాలు వెంటనే ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ నిర్మాణాలకు పూర్తయినా ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. అదేవిధంగా పగిడిరాయి, తుగ్గలి, గిరి గట్ల, ముక్కెళ్ళ, మారెళ్ళ, ఉప్పర్లపల్లి, రామకొండ, ఎద్దుల దొడ్డి, కడముకుంట్ల తదితర గ్రామాల్లో ఉన్న సచివాలయాలు నిర్మాణాలకు నోచుకోవడం లేదు. అక్కడ పనిచేస్తున్న సచివాలయాల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమా, అధికారుల నిర్లక్ష్యమా అర్థం కాని పరిస్థితి మండలంలో ఏర్పడింది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సచివాలయాల నిర్మాణాలు వేగవంతం చేసి, పూర్తి అయిన సచివాలయాలను వెంటనే ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభానికి నోచుకోని సచివాలయం

డెంగీ జ్వరాలను నియంత్రించాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

డెంగీ జ్వరాలను పూర్తిగా నియంత్రించేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. డెంగీ, మలేరియా జ్వరాలను అరికట్టేందుకు ప్రభుత్వ పరంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మలేరియా, డెంగీ జ్వరాలు కలుగజేసే దోమలు మంచి నీటిలో మాత్రమే గుడ్లు పెడతాయని తెలిపారు. టైర్లు, కొబ్బరి చిప్పలు, వాడని ఎయిర్ కూలర్లలో నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెట్టడం వల్ల ఈ వ్యాధులు వస్తాయని చెప్పారు. వీటిని ఇంటి పరిసరాల్లో లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి, నీటి నిల్వలను ఖాళీ చేసి, ఆరబెట్టి, నీటి నిల్వలపై మూత ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జెసి నారపురెడ్డి మౌర్య, డిఎంహెచ్ఒ డాక్టర్ రామగిడ్డయ్య, జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ నూకరాజు పాల్గొన్నారు.

సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజలు సంతృప్తి చెందేలా స్పందన అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను కలెక్టర్, జెసి నారపురెడ్డి మౌర్య, డిఆర్ఒ నాగేశ్వర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు స్వీకరించారు. జిల్లా స్థాయి అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రతి సోమవారం జరిగే స్పందనతో పాటు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు నిర్వహించే స్పందనలోనూ, 'జగనన్నకు చెబుదాం' వెబ్‌సైట్ ద్వారా, 'జగనన్నకు చెబుదాం'లో 1902 నెంబర్‌కు కాల్ చేసి ప్రజలు సమస్యలను తెలియజేస్తున్నారని చెప్పారు. ఈ సమస్యలను గడువులోపు నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. 1902కు కాల్ చేసిన సమస్యలను సంబంధించిన శాఖల అధికారుల ముందు పెట్టనున్నట్లు తెలిపారు. 2, 3 గంటలకోసారి ఈ లాగిన్స్ ఓపెన్ చేసుకుని సమస్యలను చూస్తూ ఉండాలని ఆదేశించారు. సచివాలయాల స్థాయిలో ఇంకా ఈ సమస్యలను చూడడం లేదని, మండల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, జడ్‌పి సిఇఒ లాగిన్ ఓపెన్ చేసి సమస్యలను చూసేలా సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించాలని తెలిపారు. సమస్యలు రీ ఓపెన్ కాకుండా ఆయా శాఖల జిల్లా అధికారులు ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

బాల్య వివాహాల అంశంలో ప్రముఖంగా కర్నూలు జిల్లా పేరు వినపడుతూ ఉంటుందని, ఈ పేరును తొలగించేలా జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టాలని కలెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని విసి హాలులో సోషల్, బిహేవియర్ చేంజ్ కమ్యూనికేషన్ సెల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పేదరికం, నిరక్షరాస్యత, వలసలు, మూఢ నమ్మకాలు, ఆడపిల్లల భద్రత తదితర కారణాల వల్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిపారు. బాల్య వివాహాల నివారణకు రాష్ట్రంలో ఉన్న మహిళా కలెక్టర్లు, మహిళా ఎస్పీలతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. గర్భిణులు, కౌమార దశలో ఉన్న బాలికల్లో రక్త హీనత నివారణకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను అందిస్తున్నట్లు తెలిపారు. వాటిని వేసుకునేలా అంగన్వాడీ సిబ్బంది, ఎఎన్‌ఎంలు దృష్టి పెట్టాలని ఆదేశించారు. బడి-ఈడు పిల్లలు బడిలో ఉండేలా, బడి మానేయకుండా సంబంధిత శాఖల అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. జెసి నారపురడ్డి మౌర్య, డిఎల్‌డిఒ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

అందరికీ సంక్షేమ ఫలాలు : హాఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : వైసిపి ప్రభుత్వంలో అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందుకున్నాయని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ. హాఫీజ్ ఖాన్ తెలిపారు. సోమవారం కర్నూలు నగరంలోని 2వ వార్డు 5వ సచివాలయం పరిధిలో చిన్న మాలగేరి, అర్బన్ బ్యాంక్, సుబేదార్ వీధుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రభుత్వ అధికారులతో కలిసి నిర్వహించారు. ఎమ్మెల్యేకు వార్డు ఇంచార్జి ఫైరోజ్‌కు వార్డ్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ సిఎం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సంక్షేమం కోసంప్రభుత్వం కృషి చేస్తుం దన్నారు.జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా దీవించాలని కోరారు. వీధిలో డ్రైనేజీ కాలువల సమస్యను ఎమ్మెల్యేదృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వార్డు ఇంచార్జి జిల్లా వక్ఫ్‌బోర్డు మెంబర్ ఫైరోజ్, వైసిపి వార్డ్ నాయకులు చాంద్‌బాషా, అనురాధ, రవి ప్రకాష్, హుస్సేన్, వెంకట్, సాహెబ్, ఇక్బాల్, యూసుఫ్, సురేష్, శ్రీరాములు, గోకారి, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే స్పందన : కమిషనర్

స్థానిక సమస్యలు వివరిస్తున్న ఐద్వా నాయకులు ఎన్.అలివేలు, కె. పద్మ

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

నగరంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్‌తేజ చెప్పారు. సోమవారం కర్నూలు మున్సిపల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ. భార్గవ్ తేజ, అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని హామీచ్చారు. సోమిశెట్టి ఎస్టేట్‌కు చెందిన శ్రీనివాసులు, ఇతరులు, తమ వీధిలో సరియైన మురుగు నీటి వ్యవస్థ లేని కారణంగా తీవ్ర ఇబ్బందులున్నాయని , వీలైనంత త్వరగా తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. నేతాజీ నగర్‌కు చెందిన సయ్యద్ కమాల్ ఇతరులు, తమ వీధిలో రోడ్డు, కాలువలు , వీధి దీపాలు లేక చాల ఇబ్బందులు పడుతున్నామన్నారు. స్టాంటన్ పురంకు చెందిన హాఫీజా , తమకు గతంలో టిడ్కో గృహం కేటాయించారని, ప్రభుత్వ నిర్ణీత మొత్తం కూడా కట్టి ఉన్నామని, కాని తమ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా తాము కట్టిన మొత్తాన్ని తిరిగి ఇప్పించాలని కోరారు. ఇలా అనేక సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. వెంటనే పరిశీలించి పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కర్నూలు నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

చట్టపరంగా న్యాయం చేస్తాం : ఎస్‌పి

పోలీస్ స్పందనకు 66 ఫిర్యాదులు

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్ : స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను న్యాయపరంగా విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా ఎస్‌పి జి. కృష్ణకాంత్ సూచించారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 66 ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...ఫుడ్ కార్పోరేషన్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఒక వ్యక్తి డబ్బులు తీసుకొని మోసం చేశాడని, నందవరం మండలానికి చెందిన కర్రెన్న ఫిర్యాదు చేశారు. కొద్ది రోజులుగా భర్త కనిపించడం లేదని ఆచూకి తెలియజేయాలని కర్నూలు మండలం, నూతన పల్లె గ్రామానికి చెందిన వరలక్ష్మీ ఫిర్యాదు చేశారు. మరిది , అత్త అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తు న్నారని కర్నూలు కు చెందిన జె. రేఖాదేవి ఫిర్యాదు చేశారు. మా నాన్న చనిపోవడంతో అద్దెకు ఉన్న వ్యక్తి మా ఇంటిని ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని కర్నూలు, ఆరోరా నగర్ కు చెందిన గౌసియా ఫిర్యాదు చేశారు. ఓర్వకల్లు ఎయిర్ పోర్టులో సూపర్ వైజర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఒక మహిళ డబ్బులు తీసుకోని మోసం చేసిందని మంత్రాలయం మండలం, నారాయణ పురం గ్రామానికి చెందిన రాజు ఫిర్యాదు చేశారు. నా పై దాడి చేసి గాయపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని దేవనకొండ మండలం, తెర్నెకల్లు గ్రామానికి చెందిన ముగతాళి సుధాకర్ ఫిర్యాదు చేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్‌పి తెలిపారు. డిఎస్‌పి నాగభూషణం, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి జి.కృష్ణకాంత్

వైసిపి పాలనకు చరమగీతం : టిడిపి

గౌరు దంపతుల ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ

పలుచోట్ల సంఘీభావ ర్యాలీలు

టిడిపి యువనేత నారాలోకేష్ యువ గళం పాదయాత్ర వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలో పాదయాత్రలు నిర్వహించారు. సంఘీభావ ప్రదర్శనలు చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో వైసిపి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి పేర్కొన్నారు. సోమవారం టిడిపి ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడు నుండి కల్లూరు చెన్నమ్మ సర్కిల్ వరకు పాదయాత్ర నిర్వహించారు. నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి ఆధ్వర్యంలో చెన్నమ్మ సర్కిల్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గౌరుచరితరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలు, రైతులు, మైనారిటీలు, దళితుల సమస్యల పరిష్కారం కోసం నారాలోకేష్ పాదయాత్ర చేపట్టడంతో వైసిపి నాయకులకు భయం పుట్టుకొచ్చినట్లు చెప్పారు. జడ్‌పి మాజీ చైర్మన్ మల్లెల రాజశేఖర్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా చేయాలి: సోమిశెట్టి

సి బెళగల్ : ప్రతి కార్యకర్త, నాయకులు గెలుపే లక్ష్యంగా పని చేస్తే వచ్చే ఎన్నికల్లో టిడిపిదే విజయమని కర్నూలు జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం బెళగల్ లోని ఎన్టీఆర్ పార్కులో రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నారా లోకేష్ చేపట్టిన యువగళం 100 రోజులపై మాట్లాడారు. ముందుగా ప్రదర్శన చేశారు. వైసిపి అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయని అన్నారు.

పత్తికొండ: పత్తికొండ పత్తికొండ మండలం రాజుల మండగిరి శివాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కెఇ. శ్యాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎం.అగ్రహారం గ్రామం నుండి చిన్నహుల్తి, పెద్దహుల్తి గ్రామం వరకు పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో జిల్లా సాంబశివ రెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు నగర పంచాయతీలో కోట్ల టీం అధ్వర్యంలో కర్నూల్ పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్, తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు కే తిరుమల్ రెడ్డి మాజీ కెడిసిసి డైరెక్టర్ ఆకే పోగు చిన్న బతుకన్న బాణా సంచా పేలిచ్చి కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు.

సి.బెళగల్‌లో మీడియాతో మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

లెమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న పాలకమండలి

మార్కెట్‌యార్డు పాలకమండలి గడువు పెంపు

6 నెలల పాటు కొనసాగిస్తూ జిఒ - పలు తీర్మానాలకు ఆమోదం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : కర్నూలు వ్యవసాయ మార్కెట్ పాలకమండలి సమావేశం సోమవారం చైర్మన్ ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గౌరవాధ్యక్షులు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో పలురకాల తీర్మానాలను పాలకమండలి ఆమోదం తెలిపింది. పాలకమండలి గడువు ముగిసినందున మరో ఆరు నెలలపాటు కొనసాగిస్తూ జిఓ ను జారీ చేశారు. ఇందులో కాటసాని రాంభూపాల్ రెడ్డి కృషి ఎంతగానో ఉందని, ఆయనను పాలకమండలి డైరెక్టర్స్, చైర్మన్,కార్యదర్శి గోవిందులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను పాలకమండలి సభ్యులు శాలువా కప్పి సన్మానించారు.

టిజివి కళాక్షేత్రం ఆధ్వర్యంలో నేడు జబర్దస్త్

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్ : నేడు మంగళవారం సాయంత్రం 6 గంటలకు టిజివి కళాక్షేత్రంలో జబర్దస్త్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. సోమవారం టిజివి కళాక్షేత్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జబర్దస్త్ వినోదిని, మంకీ వెంకీ, నవీన్ బాబి గడ్డం జీవన్ పాల్గొంటున్నారని తెలిపారు. ప్రముఖ రంగస్థలం నటులు గాయకులను 12 మందిని సత్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్, పారిశ్రామికవేత్త బివి.రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు.

మాట్లాడుతున్న ఎఒ మల్లేష్

కౌలు రైతులకు ఒప్పంద పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని ముడుమాల గ్రామంలో కౌలు రైతులకు ఎఒ మల్లేష్ కుమార్ ఒప్పంద పత్రాలను పంపిణి చేశారు. సోమవారం కౌలు రైతు సదస్సు నిర్వహించి కౌలు హక్కులపై ముందుగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అర్హులైన రైతులకు ఒప్పంద పత్రాలు అందజేసి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ సంతోషం

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రతి ఇంటి సంక్షేమంతో, ప్రతి కుటుంబంలో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 15వ వార్డు సచివాలయంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూరుతోందని తెలిపారు. గడప గడపకు తిరిగి ఆయా ఇళ్లలో లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్ లెట్లు అందించారు. వార్డులో కొందరు సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ తదితర సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

సంక్షేమ పథకాల అమలుపై ఆరా

- 'గడప గడపకు'లో ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రభుత్వం నుంచి మంజూరైన సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందిన వారి నుంచి వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు వై.ప్రదీప్ రెడ్డి ఆరా తీశారు. సోమవారం మండలంలోని మాలపల్లి సచివాలయం పరిధిలోని సౌళ్లహళి గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికీ తిరిగి నాలుగేళ్ల పాలనలో మంజూరైన సంక్షేమ పథకాలకు సంబంధించిన బుక్ లెట్ అందజేసి ముందుకు సాగారు. ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు లక్ష్మి రెడ్డి, సర్పంచి రాధమ్మ, ఎంపిటిసి ఈరన్న నాయకులు సాయి నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప స్వాముల పటం దేవర

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని బెల్డోన గ్రామంలో సోమవారం కురువ వంశీయులు నిర్వహించిన బీరప్ప స్వాముల పటం దేవర మహోత్సవం వేలాది మంది భక్తుల మధ్య వైభవంగా సాగింది. కర్ణాటకకు చెందిన కురువ వంశీయులు, తెలుగు రాష్ట్రాలకు చెందిన కురువ వంశీయులు వారి ఆచారాల మేరకు బీరప్ప స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఢమరుకం వాయించుకుంటూ స్వాముల ఊరేగింపు చేపట్టారు. ఊరేగింపు సమయంలో ఒక్కసారిగా రోడ్డుపైకి వేలాది మంది భక్తులు రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గుంతకల్లు, ఆలూరుకు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వేలాదిమంది భక్తులకు, ప్రజలకు అన్నదాన వసతి కల్పించారు. దేవర మహోత్సవ ఏర్పాట్లకు సర్పంచి దంపతులు కరివేముల సావిత్రి, గోవిందు సహాయ, సహకారాలు అందించారు. చిప్పగిరి ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- వ్యకాస, కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి బి.తిక్కప్ప డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కుప్పగల్లు, సంతేకుడ్లూరు గ్రామాల్లో పర్యటించి ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి కూలీలకు ఇప్పటికే ఐదు వారాలకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బిల్లుల చెల్లింపులో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు.

నీరజారెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం

- వైసిపి నుంచి ఆలూరు ఎమ్మెల్యేగా పోటీ చేస్తాం - నీరజా రెడ్డి కుమార్తె హిమవర్ష రెడ్డి

ప్రజాశక్తి- దేవనకొండ

సమావేశంలో మాట్లాడుతున్న హిమవర్ష రెడ్డి

'మా అమ్మ, మాజీ ఎమ్మెల్యే నీరజారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం' అని నీరజారెడ్డి కుమార్తె పాటిల్ హిమవర్ష రెడ్డి తెలిపారు. రాజకీయ రంగ ప్రవేశం చేసి ప్రజాసేవకు అంకితమవుతానని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసి వైసిపిలో చేరానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని పేర్కొన్నారు. సోమవారం తెర్నేకల్లు గ్రామంలోని ఆమె స్వగృహంలో అభిమానులు, మద్దతుదారులతో భర్త చంద్రశేఖర్ రెడ్డితో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి పాలనలో తమ తల్లి ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పలు అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేశారని చెప్పారు. అభిమానులు, మద్దతుదారులతో చర్చించి ప్రణాళిక బద్ధంగా రాజకీయాల్లో ముందుకు వెళ్లి త్వరలో పాదయాత్రలు చేపడతామన్నారు. వైసిపి నుంచి టికెట్ రాకపోతే భవిష్యత్తు ప్రణాళిక ఏమిటని విలేకరులు ప్రశ్నించగా... వైసిపి నుంచి ఆలూరు టికెట్టు రాకపోతే పత్తికొండ నుంచి పోటీ చేస్తానని, అవసరమైతే ఇండిపెండెంట్‌గా కూడా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. పత్తికొండ షేక్ నజీర్, తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- బిటి రోడ్డుకు భూమి పూజ

ప్రజాశక్తి - ఆదోని

పేదలకు సొంతింటి కల సాకారం చేసే దిశగా జగనన్న, ఇందిరమ్మ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని డీఎస్పీ బంగ్లా నుంచి ధణాపురం, ఆలూరు రోడ్డు వరకు రూ.7.50 కోట్ల వ్యయంతో చేపట్టే బిటి రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. 2008లో వైఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఇంటి నిర్మాణం కోసం రూ.2100 డిడిలు చెల్లించిన బాధితులకు ఇంటి స్థలాలకు పట్టాలిచ్చామని తెలిపారు. పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను రద్దు చేసేందుకు 2014లో టిడిపి నాయకులు ప్రయత్నాలు చేశారన్నారు. ఆటోనగర్ పేరుతో పేదల పట్టాలను రద్దు చేసి స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నించగా ఎమ్మెల్యేగా తాను అప్పట్లో అడ్డుపడ్డానని తెలిపారు. అధికారంలోకి రాగానే పట్టాలు ఇస్తామని పేదలకు ఇచ్చిన హామీ మేరకు వార్డుల వారీగా స్థలాలను అప్పగిస్తూ హక్కుపత్రం ఇస్తున్నామని చెప్పారు. తాగునీరు, రోడ్డు సదుపాయాలు కల్పిస్తున్నామని, త్వరలోనే ఇళ్లల్లో చేరి కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పార్టీలకు అతీతంగా నిరుపేదలకు జగనన్న కాలనీలో పట్టాలు, అమ్మ ఒడి, రజకులకు, నాయీ బ్రాహ్మణులకు, ఆటో, చేనేత కార్మికులకు, రైతులను ఆర్థికంగా ఆదుకొని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అండగా నిలిచారన్నారు. రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కొత్తగా నిర్మించే రోడ్డు వల్ల వాహనదారులకు ఇబ్బందులు తప్పుతాయని తెలిపారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, కౌన్సిలర్లు ఉస్మాన్ బాష, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కాంట్రాక్టర్లు చెన్నారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

చట్టం అందరికీ సమానమే...

- ఎస్సీ, ఎస్టీ కేసు విచారణలో డీఎస్పీ యుగంధర్ బాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

చట్టం అందరికీ సమానమేనని, చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక విచారణ అధికారి, డీఎస్పీ యుగంధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన మాల మునిస్వామి తన భార్యను కిడ్నాప్ చేశారని మాధవరం పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుపై విచారణ చేపట్టారు. మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో 15 రోజుల క్రితం వైసిపి నాయకులు, జడ్‌పిటిసి కుమారుడు బోయ మజ్జిగ రోగప్పపై మాధవరం పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదయింది. కర్నూలు ఎస్టీ సెల్ ప్రత్యేక విచారణ అధికారి యుగంధర్ బాబు సోమవారం రచ్చుమర్రి గ్రామానికి చేరుకుని దళిత వాడలో తిరిగి గ్రామంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో దళితులను విచారించారు. గ్రామంలో దళితులను ప్రత్యేకంగా విచారించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. దళిత, మాలల కుటుంబాలు బోయ రోగప్ప తమపై చేసిన అకృత్యాలను ప్రత్యేకాధికారికి వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. కేసు పూర్వాపురాలను తెలుసుకొని జరిగిన అన్యాయంపై ఎస్పీకి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. గ్రామంలో ఎలాంటి ఘర్షణలకూ తావు లేకుండా పోలీసు పికెటింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంత్రాలయం సిఐ శ్రీనివాసులు, మాధవరం ఎస్ఐ కిరణ్ బాబు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ

22న కలెక్టరేట్ ముట్టడి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు తిక్కన్న

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ఈనెల 22న చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ఈడిగ తిక్కన్న కోరారు. సోమవారం మండలంలోని చిన్నతుంబలం గ్రామంలో ఉపాధి కూలీల పని ప్రదేశంలో సమావేశం నిర్వహించారు. కూలీల పని తీరు, కూలీలకు రావాల్సిన వేతనాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తిక్కన్న, రైతు సంఘం నాయకులు పరమేష్, సిఐటియు నాయకులు ఈరన్న, హనుమంతు మాట్లాడారు. ఈశ్వరమ్మకు జాబ్ కార్డు ఉందని, పని ప్రదేశంలో ఆమె చేయి విరిగిందని తెలిపారు. ప్రభుత్వం ఎలాంటి సాయమూ అందించలేదని చెప్పారు. అలాగే ఎన్ని వారాలు పని చేసినా ఇందిరమ్మకు ఒక్క రూపాయి వేతనం కూడా ఇవ్వలేదని తెలిపారు. సమస్య ఏమిటని మేటీని అడిగితే 'ఈరోజు పడుతున్నాయి. రేపు పడుతున్నాయి.. వచ్చే వారం పడతాయి' అని సమాధానం చెబుతున్నారని అన్నారు. ఆమెకు వేతనం రాలేదని తెలిపారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు నీటి వసతి కల్పించడం లేదు, మెడికల్ కిట్లను అందించడం లేదని చెప్పారు. 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతిలోనే పని కల్పించాలని కోరారు. పని ప్రదేశంలో చనిపోయిన కూలీకి వెంటనే ప్రభుత్వం రూ.10 లక్షల వరకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలు పని ప్రదేశానికి వెళ్లి, రావడానికి 8 కిలోమీటర్ల రవాణా చార్జీ ఇవ్వాలని కోరారు. ఉపాధి కూలీల సమస్యలపై ఈనెల 22న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న తిక్కన్న

స్పందన అర్జీలను పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన నిర్వహించారు. డివిజన్ స్థాయిలో అర్జీలను స్వీకరిస్తూ సంబంధిత అధికారులకు ఎండార్స్‌మెంట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోమవారం వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. పరిపాలన అధికారి గోవిందు, డిప్యూటీ తహశీల్దార్ రమాదేవి, పౌర సరఫరాల శాఖ ఉప తహశీల్దార్ వలీ బాష, డిఎల్‌పిఓ నూర్జహాన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చేతన్ ప్రియా, మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రంగయ్య పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు రంగయ్య 34వ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం జిల్లా నాయకులు మాల మల్లేష్ ఆధ్వర్యంలో పట్టణంలో బ్యానర్లు కట్టి వేడుకలు నిర్వహించారు. ఆయన చేసిన సేవలను డాక్యుమెంటరీ రూపంలో ఆవిష్కరించి, రాష్ట్రవ్యాప్తంగా తెలియజేస్తామని యువకులు తెలిపారు. గ్రామ గ్రామాల నుంచి దళితులు పూలమాలలు, పుష్ప గుచ్ఛాలు, కేకులతో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న

టిడిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి కోరారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. మంత్రాలయం రోడ్డులోని అనంత పద్మనాభస్వామి దేవాలయం దగ్గర నుంచి పాదయాత్ర ప్రారంభించి, కర్నూలు రోడ్డులో బాట మారెమ్మ దేవాలయం వద్ద ముగించారు. అనంత పద్మనాభస్వామి దేవాలయం, వ్యవసాయ మార్కెట్ కమిటీ, శ్రీనివాస టాకీస్, ట్యాంకు బండ్ రోడ్డు, సోమప్ప సర్కిల్, శివ సర్కిల్, ఎద్దుల మార్కెట్, నాగి రెడ్డి పెట్రోల్ బంకు మీదుగా కర్నూలు రోడ్డులోని బాట మారెమ్మ దేవాలయం వరకు దాదాపు 7 కిలో మీటర్లు పాదయాత్ర సాగింది. మాజీ ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ... లోకేష్ పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ప్రజాదరణను చూసి ఓర్వలేని వైసిపి నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారని విమర్శించారు. నాయకులు కొండయ్య చౌదరి, విజిఎ.దయాసాగర్, చిన్న రాముడు, గడ్డం నారాయణ రెడ్డి, రైస్ మిల్ నారాయణ రెడ్డి, కాశీం వలీ, ధర్మపురం గోపాల్, వెంకటరామిరెడ్డి, భార్గవ్, వాల్మీకి శంకర్, సుందర్ రాజు, మల్లికార్జున, రంగస్వామి గౌడ్, కలీముల్లా, తురేగల్ నజీర్, కటారి రాజేంద్ర, షాబీర్, సలాం, సలీం, హుసేన్ పీరా, బోయ రంగన్న, అంజి, జయన్న, మధుబాబు, పార్లపల్లి మల్లికార్జున, రాళ్లదొడ్డి మురళీకృష్ణ రెడ్డి, కలగట్ల కొండన్న గౌడ్, నరసన్న గౌడ్, అయాలప్ప, దేవేంద్ర, రమేష్ నాయుడు, ఎన్‌వి.రామాంజనేయులు, రంగస్వామి నాయుడు పాల్గొన్నారు. **నందవరంలో** టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు హాలహర్వి దావీదు, నందవరం ఎస్సీ సెల్ అధ్యక్షులు ముగతి బాలరాజు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. మాజీ సర్పంచి దాస్ నరేష్, రవి పాల్గొన్నారు. **ఆలూరు** నియోజకవర్గ ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించలేని పాలకులకు పాలించే అధికారం లేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ తెలిపారు. యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా హత్తి బెళగల్ గ్రామం నుంచి ఆలూరు టిడిపి కార్యాలయం వరకు నియోజకవర్గ పరిశీలకులు ఆదినారాయణ, సుజాతమ్మ పాదయాత్ర నిర్వహించారు. నాయకులు సి.నారాయణరెడ్డి, మీనాక్షి నాయుడు, విరుపాక్షి, గుమ్మనూరు హంపయ్య, మనేకుర్తి రాజశేఖర్, మండల కన్వీనర్ అశోక్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో పాదయాత్ర నిర్వహిస్తున్న బీవీ

భారత ప్రభుత్వం

పర్యావరణం, అడవులు & వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ

ఇంటిగ్రేటెడ్ రీజినల్ ఆఫీస్, విజయవాడ

గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ - 520010, ఆంధ్రప్రదేశ్ ఈమెయిల్: iro.vijavawada-mefcc@gov.in

F.No. 4-APC181/2022-VIJ/600 Date 7th February, 2023

దిగువ తెలిపిన వానికి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి,పర్యావరణం, అడవులు, సైన్స్ & టెక్నాలజీ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రూమ్‌నెం.268, 1వ అంతస్తు, 4వ బ్లాక్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, వెలగపూడి, అమరావతి, గుంటూరు జిల్లా- 522503

విషయం: మెస్సర్స్ హిమాచల్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ పేరున కర్నూలు జిల్లా, పాణ్యం మండలంలోని పిన్నాపురం పంప్డ్ స్టోరేజి ప్రాజెక్ట్ (పిఎస్‌పి) కి గోరకల్లు రిజర్వాయర్ నుండి ఇంటిగ్రేటెడ్ కారిడార్ (ట్రాన్స్‌మిషన్ లైన్, వాటర్ పైప్ నెట్‌వర్క్ మరియు రోడ్డు వేయుట) నిర్మాణం కోసం కర్నూలు డివిజన్, గని ఆర్ఎఫ్ యొక్క కంపార్ట్‌మెంట్ నెం.93, 94,106,111,112,113 & 114 లోని 12.58 హెక్టార్ల అటవీ భూమి మళ్ళింపునకు సంబంధించి

సర్!

పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం అటవీ (సంరక్షణ) చట్టం, 1980లోని సెక్షన్ 2కు అనుగుణంగా అటవీ భూమి మళ్ళింపు కొరకు కేంద్రప్రభుత్వం యొక్క ముందస్తు ఆమోదం కోరేందుకు రాష్ట్ర ప్రభుత్వ లేఖ నం.1486/సెక్షన్-2 /2022/ (1764447), తేది: 01.07.2022 మరియు ఆన్‌లైన్ ప్రతిపాదన నం.ఎఫ్‌పి/ఏపి/అథర్స్/ 153264/2022 రిఫర్ చేయటం అయినది. 27.07.2022 నాటి లేఖ ద్వారా కేంద్ర ప్రభుత్వ సూత్రప్రాయ ఆమోదం (స్టేజి-1)లభించింది. రాష్ట్ర ప్రభుత్వ లేఖ నం.1486/సెక్షన్-2 /2022/ (1764447), తేది: 27.01.2023 ద్వారా ఆమోదంలో నిర్దేశించిన షరతులకు అనుగుణంగా వున్నట్లు తెలిపింది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన మరియు రీజినల్ ఎంపవర్డ్ కమిటీ(ఆర్ఇసి) సిఫార్సును క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత, దిగువ తెలిపిన నిబంధనలకు లోబడి మెస్సర్స్ హిమాచల్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ పేరున కర్నూలు జిల్లా, పాణ్యం మండలంలోని పిన్నాపురం పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్(పిఎస్‌పి)కు గోరకల్లు రిజర్వాయర్ నుండి ఇంటిగ్రేటెడ్ కారిడార్ (ట్రాన్స్‌మిషన్ లైన్, వాటర్ పైప్ నెట్‌వర్క్ మరియు రోడ్డు వేయుట) నిర్మాణం కొరకు కర్నూలు జిల్లా, గని ఆర్ఎఫ్ లోని కంపార్ట్‌మెంట్ నంబర్లు: 93,94,106,111,112,113 & 114లోని 12.58 హెక్టార్ల అటవీ భూమి మళ్ళింపు కోసం అటవీ (సంరక్షణ) చట్టం 1980లోని సెక్షన్ 2 క్రింద కేంద్రప్రభుత్వం యొక్క సూత్రప్రాయ ఆమోదం (స్టేజి -2) ను నేను తెలియజేస్తున్నాను.

1)మళ్ళించబడిన అటవీ భూమి యొక్క న్యాయపరమైన స్టేటస్‌లో మార్పు ఉండదు.
2)యూజర్ ఏజెన్సీ యొక్క ఖర్చుతో 20 మీటర్ల నిడివితో తగు విధంగా నంబర్లు వేయబడిన 4 అడుగుల ఎత్తుగల కాంక్రీట్‌పిల్లర్లు నెలకొల్పడం ద్వారా ప్రతిపాదిత అటవీ భూమి యొక్క డీమార్కేషన్ చేపట్టాలి.
3) యూజర్ ఏజెన్సీ ఖర్చుతో కర్నూలు జిల్లా, పాణ్యం మండలం, పాణ్యం గ్రామంలోని సర్వేనెంబర్లు 1830 , 1836, 1835, 1828/పార్ట్, 1828/1 పార్ట్, 1828/2, 1829/పార్ట్ మరియు 1827లోని 12.75 హెక్టార్లు (బిట్-1 - 4.51 హెక్టార్లు మరియు బిట్-2: 8.24 హెక్టార్లు) విస్తీర్ణంలో రాష్ట్ర అటవీ శాఖ అవసరమగు సిఏ కార్యకలాపాలు చేపట్టాలి.
4) కేంద్ర ప్రభుత్వం యొక్క ముందస్తు ఆమోదం లేకుండా సిఏ పథకం కొరకు గుర్తించబడిన అటవీయేతర ప్రాంతం మార్చకూడదు. సిఏ భూమి తగు విధంగా డీమార్కేట్ చేయవలెను మరియు అతిక్రమణలను నివారించేందుకు అటవీ శాఖకు అటవీయేతర భూమి బదిలీకి సంబంధించి స్థానిక గ్రామస్తులకు తగినంతగా సమాచారం ఇవ్వవలెను.
5) మళ్ళించిన అటవీ భూమి యొక్క నికర ప్రస్తుత విలువగా అదనపు మొత్తం భవిష్యత్తులో గౌరవ భారత సుప్రీమ్ కోర్టుచే అది తగు విధంగా సవరించబడిన తరువాత, యూజర్ ఏజెన్సీ నుండి రాష్ట్ర ప్రభుత్వంచే ఛార్జ్ చేయబడును. యూజర్ ఏజెన్సీ దీనికి సంబంధించి అండర్ టేకింగ్ దాఖలు చేయాలి.
6) యూజర్ ఏజెన్సీ గోరకల్లు రిజర్వాయర్ నుండి నీటిని లిఫ్టింగ్ చేసే ముందు వన్యప్రాణుల ఉపశమన ప్రణాళికను తయారు చేసుకుని, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌చే తగువిధమైన ఆమోదాన్ని పొందవలెను. రాష్ట్ర అటవీ శాఖ వారు దానిని యూజర్ ఏజెన్సీ ఖర్చుపై అమలు చేయవలెను. దీనికి సంబంధించిన అండర్‌టేకింగ్ యూజర్ ఏజెన్సీచే దాఖలు చేయబడాలి.
7)మళ్ళింపు కోసం ప్రతిపాదించిన అటవీ భూమిని ఎట్టి పరిస్థితులలోనూ కేంద్ర ప్రభుత్వం ముందస్తు ఆమోదం లేకుండా ఏదేని ఇతర ఏజెన్సీకి, శాఖకు లేదా వ్యక్తికి బదిలీ చేయరాదు లేదా అద్దెకు ఇవ్వరాదు.
8)అటవీ శాఖ కఠినమైన పర్యవేక్షణలో అవసరమైన చోట చెట్ల నరికివేతను చేపట్టాలి.
9)యూజర్ ఏజెన్సీ 33 కె.వి. సామర్థ్యం గల ప్రతిపాదిత ట్రాన్స్‌మిషన్ లైన్ కోసం ప్రామాణిక దారి హక్కును పాటించవలెను.
10) యూజర్ ఏజెన్సీ ప్రాజెక్ట్ ఖర్చులో సంబంధిత డిఎఫ్‌ఓను సంప్రదించడం ద్వారా అవసరమైన చోట రీటెయినింగ్ వాల్స్ మరియు చెక్ వాల్స్ నిర్మించాలి.
11) సహజ సిద్ధంగా ఏర్పడిన వాగులు/ నదులు/ కాలువలపై ఏదైనా కల్వర్ట్‌లు/వంతెనల నిర్మించిన యెడల, నీటి సహజ ప్రవాహ మార్గానికి అడ్డంకి గాని, నీటిని నిలువ ఉంచని మరియు వన్య జీవుల రాకపోకలకు అడ్డంకి కాని విధానంలో చేపట్టవలెను.
12) త్రవ్విన మెటీరియల్ / ఓవర బర్డెన్‌గా మారిన వాటిని అటవీ ప్రాంతానికి వెలుపల పారవేయవలెను. అటవీ ప్రాంతంలో ఎటువంటి మెటీరియల్‌ను నిల్వ చేయరాదు.
13) ప్రతిపాదన యొక్క లేఔట్ ప్లాన్‌ను కేంద్ర ప్రభుత్వం యొక్క ముందస్తు ఆమోదం లేకుండా మార్చరాదు.
14) యూజర్ ఏజెన్సీ చెట్ల నరికివేతను నివారించేందుకు సైట్‌లో పని చేసే కార్మికులను వంట చెరకును ముఖ్యంగా ప్రత్యామ్నాయ ఇంధనాన్ని ఏర్పాటు చేయాలి మరియు అటవీ ప్రాంతం లోపల లేబర్ క్యాంప్‌ను ఏర్పాటు చేయరాదు.
15) వీలైనంత మేరకు అటవీ ప్రాంతం వెలుపల కార్మిక శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆటంకం కనిష్టంగా ఉంచబడును మరియు పని నిర్వహణలో నిమగ్నమైన కార్మికులను మరియు సిబ్బందిని సమీపంలోని అటవీ వృక్షజాలం మరియు జంతుజాలాన్ని నాశనం చేయకుండా ఉండేలా చూసుకోవడం యూజర్ ఏజెన్సీదే బాధ్యత.
16) ప్రాజెక్టుకోసం వినియోగించిన మొత్తం అటవీ ప్రాంతం 12.58 హెక్టార్లకు మించకూడదు మరియు మళ్ళించిన అటవీ విస్తీర్ణం మళ్ళింపు ప్రతిపాదనలో చూపినది కాకుండా మరే ఇతర అవసరం నిమిత్తం ఉపయోగించరాదు.
17) ప్రాజెక్ట్ పని నిర్వహణకు నిర్మాణ మెటీరియల్స్ రవాణా కోసం అటవీ ప్రాంతం లోపల ఎలాంటి అదనపు లేదా కొత్తం మార్గం నిర్మించకూడదు.
18) ప్రాజెక్టుకు వర్తించే ప్రస్తుతానికి అమలులో వున్న అన్ని చట్టాలు, నియమాలు, నిబంధనలు మరియు మార్గదర్శకాలను యూజర్ ఏజెన్సీ మరియు రాష్ట్రప్రభుత్వం పాటించాలి.
19) ప్రాంతంలోని జంతుజాలం మరియు వృక్షజాలం సంరక్షణ మరియు నిర్వహణ, అడవుల పెంపకం ప్రయోజనంలో కేంద్ర ప్రభుత్వం లేదా ప్రాంతీయ అధికారి (సెంట్రల్), ఇంటిగ్రేటెడ్ రీజినల్ ఆఫీస్, విజయవాడ వారు కాలానుగతంగా విధించే ఏవేని ఇతర నిబంధనలను యూజర్ ఏజెన్సీ పాటించాలి.
20)పైన తెలిపిన ఏవేని నిబంధనలను పాటించడంలో విఫలమైతే ఎఫ్‌సిఏ, 1980 క్రింద జారీ చేయబడిన నియమాలు/ మార్గదర్శకాలలోని ప్రొవిజన్ల ప్రకారం యూజర్ ఏజెన్సీ పై చర్య తీసుకొనబడును.

మీ విశ్వాసపాత్రుడు
సం/- (ఎన్.ఎస్.మురళి)
ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ (సెంట్రల్)

టిడిపి అధికారం చేపట్టడం తథ్యం

- లోకేష్ పాదయాత్రకు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు
- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

వైసిపి అరాచక పాలన పట్ల ప్రజలు విసిగెత్తిపోయారని, రాష్ట్రంలో టిడిపి అధికారం చేపట్టడం తథ్యమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు ధీమా వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం కార్యకర్తలు, అభిమానులతో మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో ఆయన స్వగృహం ముందు టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. అక్కడి నుంచి మీనాక్షి నాయుడు, ఉమాపతి నాయుడు, భూపాల్ చౌదరి ఆధ్వర్యంలో ర్యాలీగా ఎన్‌టిఆర్ విగ్రహానికి, పొట్టిశ్రీరాములు, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి మీనాక్షి నాయుడు నివాసానికి పాదయాత్ర ద్వారా చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసి జిల్లాలో దిగ్విజయంగా సాగుతోందని తెలిపారు. నారా, నందమూరి కుటుంబ సభ్యులు, స్నేహితులు పాదయాత్రలో భాగస్వాములు కాబోతున్నారని చెప్పారు. లోకేష్ పాదయాత్రకు ప్రభుత్వం ఎన్నో అడ్డంకులు సృష్టించిందని, అన్నింటినీ అధిగమించి పాదయాత్ర విజయవంతంగా సాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా లోకేష్ యువగళానికి సంఘీభావంగా పాదయాత్రలు చేపట్టినట్లు చెప్పారు. యాత్రలో కులమతాలకు అతీతంగా ప్రజలతో లోకేష్ మమేకమవుతున్నారన్నారు. జగన్ పాలనకు ముగింపు పలకడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాబోయేది టిడిపి ప్రభుత్వమేనని, ఎవరూ అధైర్య పడవద్దని చెప్పారు. నాయకులు బుద్ధారెడ్డి, బత్తిని కుబేర్‌నాథ్, మారుతి నాయుడు, సిద్ధార్థ నాయుడు, తిమ్మప్ప, వెంకటేష్, లక్ష్మీనారాయణ, రంగన్న, జయరాం, రంగస్వామి నాయుడు, కృష్ణారెడ్డి, జగదీష్, శేషి రెడ్డి, బసవ, మహ్మద్, మహిళా నాయకులు ఉన్నారు.

పాదయాత్ర నిర్వహిస్తున్న మీనాక్షి నాయుడు, నాయకులు

'యువగళం'తో వైసిపిలో వణుకు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణను చూసి వైసిపిలో వణుకు మొదలైందని టిడిపి సీనియర్ నాయకులు మదిరే భాస్కర్ రెడ్డి, రామస్వామి, దేవేంద్రప్ప, సౌదీ రావూఫ్ తెలిపారు. సోమవారం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని సిటీ బస్ కాంపౌండ్‌లోని కార్యాలయంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసిపి పాలన పట్ల ప్రజలు విసిగిపోయారని విమర్శించారు. నాయకులు వడ్డెమాన్ గోపాల్, సోమశేఖర్ రెడ్డి, నారాయణపురం, షేక్షావలీ, రాముడు, మల్లేష్, శివయ్య స్వామి, పరశురాముడు, భారత్ శ్రీనివాస్, తిక్కన్న, కొండాపురం, శ్రీనివాస్ ఉన్నారు.

కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఎమ్మెల్సీగా డాక్టర్ మధుసూదన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలికి రాష్ట్రంలోని వివిధ స్థానిక సంస్థల నుంచి ఎన్నికైన 8 మంది నూతన ఎమ్మెల్సీలు ప్రమాణం స్వీకారం చేశామని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. వెలగపూడిలోని రాష్ట్ర అసెంబ్లీ భవనం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేన్ రాజు నూతన సభ్యులతో ప్రమాణం చేయించారని తెలిపారు. రాష్ట్ర శాసన సభ సెక్రటరీ జనరల్ డాక్టర్ పిపికె.రామాచార్యులు నూతన ఎమ్మెల్సీల పేర్లను వరుస క్రమంలో పిలవగా శాసన మండలి అధ్యక్షులు మోషేన్ రాజు ప్రమాణం చేయించారని చెప్పారు. కర్నూలు స్థానిక సంస్థల నుంచి తాను ప్రమాణం స్వీకారం చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న మధుసూదన్

ఒక్క సారి అవకాశమివ్వండి

- తాగు, సాగునీరందిస్తాం
- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎమ్మెల్యేగా గెలిపించి ఒక్క సారి అవకాశం ఇవ్వాలని, నియోజకవర్గానికి తాగు, సాగునీరు అందిస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి కోరారు. సోమవారం టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి అధ్యక్షతన స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో టిడిపి చైతన్య రథంపై మాట్లాడారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నేటికీ వంద రోజులు పూర్తి కావడంతో ఆయనకు మద్దతుగా మండలంలోని చిలకలడోన గ్రామం నుంచి మంత్రాలయం వరకు 10 కిలో మీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. కేవలం వ్యాట్సప్ మెసేజ్ చూసి పాదయాత్రలో ఇంత మంది నాయకులు కార్యకర్తలు పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యతో పాటు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న 2024 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఒక్క సారి అవకాశం ఇవ్వాలని, సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రస్వామి మఠం వరకు ర్యాలీగా వెళ్లి బాణసంచా పేల్చి శ్రీమఠం ఆవరణలో వంద కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం టిడిపి రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గంలో అభివృద్ధి లేదని, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దందాలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఇక జగన్ పార్టీకి కాలం చెల్లిందని, రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

వికలాంగునికి ట్రై సైకిల్ పంపిణీ

యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేష్ వికలాంగునికు ఇచ్చిన హామీ మేరకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి మూడు చక్రాల సైకిల్‌ను పంపిణీ చేశారు. యువగళం పాదయాత్రలో భాగంగా పెద్దకడబూరు మండలం నెమలికల్లు గ్రామానికి చెందిన బోయ శాంతప్ప ట్రై సైకిల్ ఇప్పించాలని లోకేష్‌ను కోరారు. ఈ నేపథ్యంలో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామికి సైకిల్ పంపించినట్లు తిక్కారెడ్డి తెలిపారు. వికలాంగుడైన శాంతప్పను పిలిచి స్థానిక పంకజ ప్యారడైజ్‌లో పంపిణీ చేశారు. హామీని నిలబెట్టుకున్న లోకేష్‌కు శాంతప్ప కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, పెద్దకడబూరు మండల అధ్యక్షులు బసలదొడ్డి ఈరన్న, ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయ కమిటీ మాజీ ఛైర్మన్ చెన్నబసప్ప గౌడ్, నాయకులు అడివప్పగౌడ్, చావిడి వెంకటేష్, చిలకలడోన హనుమంతు, అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణ మనోహర్ రెడ్డి, ఎంపిటిసి వెంకటేష్, విజయరామిరెడ్డి, పవన్, వట్టేప్ప గారి సుంకప్ప, వట్టేప్ప గారి నరసింహ పాల్గొన్నారు.

పాదయాత్ర నిర్వహిస్తున్న తిక్కారెడ్డి

స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

- ఉపాధి ఫేస్ యాప్ రద్దు చేయాలి
- వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివ నాగరాణి
- కలెక్టరేట్ ఎదుట వ్యకాస ఆధ్వర్యంలో కూలీలు ధర్నా

ధర్నా వద్దకు వచ్చి మాట్లాడుతున్న పీడీ రామ చంద్రా రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీరు, మజ్జిగ, విడిదికి టెంట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివ నాగరాణి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్ సవరించి, కూలీల సమస్యలు పరిష్కారం చేయకపోతే కేంద్ర ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. ఎపి వ్యకాస రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లాలోని ఉపాధి కూలీలు నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శివ నాగరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్‌లు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి తక్కువ బడ్జెట్ కేటాయించి గ్రామీణ పేదలకు చట్టాన్ని దూరం చేసే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఇదే జరిగితే బిజెపి ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. కొత్తగా ఫోటో యాప్‌ను తేవడం వల్ల కూలీలు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. గతంలో ఉన్న మౌలిక సదుపాయాలు టెంటు, మంచినీళ్లు, మజ్జిగ, మెడికల్, బీమా పథకం, పనిముట్లు, సమ్మర్ అలవెన్సు, మేటీలకు అలవెన్స్ లాంటివి ఏమీ లేకుండా చేసిందని కేంద్రంపై మండిపడ్డారు. కూలీలు పనిచేసే చోట నీడ సౌకర్యం లేకపోవడంతో ఎండ తీవ్రతకు తాళలేక అక్కడికక్కడే మరణిస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో ఆరుగురు కూలీలు మరణించారని, వారికి ఎటువంటి నష్టపరిహారం ప్రకటించలేదని తెలిపారు. చనిపోయిన కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత విధానాన్ని కొనసాగించి ఫోటో యాప్ ఎత్తివేసి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం ధర్నా వద్దకు వచ్చిన ఎన్ఆర్ఇజిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్ర రెడ్డికి వినతి పత్రం స్వీకరించారు. పీడీ స్పందిస్తూ తమ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కారం చేస్తామని, మిగతావి పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా నాయకులు ఈశ్వరయ్య, డేవిడ్, నరసింహ నాయక్, పకీర, బాలయ్య, ఓబులేసు, బంగారం, రత్తమయ్య, కృష్ణ, సుబ్బరాయుడు, రైతు సంఘం జిల్లా నాయకులు నరసింహ, రామచంద్రుడు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను మరింత మెరుగ్గా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో వినూత్న రీతిలో ప్రజా ఫిర్యాదుల స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన సమస్యలను ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలన్నారు. టాప్ 4, 10 రెవెన్యూ సర్వీసులు క్లియర్ చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన పనులు గ్రౌండ్‌లోకి తెచ్చేందుకు గుత్తే దారులను ప్రోత్సహించాలన్నారు. ప్రతి రోజు సచివాలయంలో మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 వరకు స్పందన గ్రీవెన్స్ తీసుకొని సంబంధిత నోట్ ఫొటోగ్రాఫ్స్ అప్లోడ్ చేయాలన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

పగిడ్యాల మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన మద్దిలేటి తనకు షుగర్ కారణంగా రెండు కాళ్ళు తొలగించారని, రూ.3 వేలు పింఛన్ సరిపోవడం లేదని, రూ. 5 వేలు ఇప్పించి నన్ను ఆదుకోవాలని కలెక్టర్‌కు విన్నవించాడు. కలెక్టర్ స్పందించి మద్దిలేటికి ట్రై సైకిల్ ఇవ్వాలని వికలాంగుల శాఖ అధికారిని ఆదేశించారు. అలాగే బేతంచెర్ల మండలం రేపల్లెకు చెందిన మహిళ వై. రేణుక భర్త సత్యనారాయణకు గ్రామ పొలిమేరలో సర్వే 308లో 2.50 సెంట్ల డి-పట్టా భూమికి ఆన్లైన్ అడంగల్‌లో రెడ్ మార్క్ తొలగించాలని కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. కలెక్టర్ వెంటనే అడంగల్‌లోని రెడ్ మార్క్ తొలగించి సమస్యను పరిష్కరించారు. బండి ఆత్మకూరు మండలం చిన్నదేవలాపురం గ్రామ వాసి హుస్సేన్ సాహెబ్ చిరు వ్యాపారం చేసి రూ.1 లక్ష 77 వేల 100 బి.కోడూరు బ్యాంక్‌లో జమ చేసుకున్నానని, అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి షేక్ హుస్సేన్ వలి తనకు తెలియకుండా నా బ్యాంక్ పాస్ బుక్ నుండి డ్రా చేసుకున్నాడని, ఎలాగైనా తన డబ్బును తిరిగి ఇప్పించి ఆదుకోవాలని కోరాడు. మొత్తం 161 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో డిఆర్ఒ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ సుబ్బారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అవుకు జలాశయంలో

గల్లంతైన యువతి మృతదేహం లభ్యం

- కానిస్టేబుల్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అవుకు

అవుకు రిజర్వాయర్‌లో కానిస్టేబుల్ రసూల్ కుటుంబం విహారయాత్రకు వచ్చి బోటు బోల్తా పడిన ఘటనలో గల్లంతైన సాజిద (20) మృతదేహం సోమవారం లభ్యమయింది. డోన్ ఆర్డీవో వెంకటరెడ్డి, అవుకు ఎస్సై జగదీశ్వర్ రెడ్డిల పర్యవేక్షణలో ఎస్‌డిఆర్ఎఫ్ రెస్క్యూ టీం బృందాలు జలాశయంలో గాలింపు చర్యలు చేపట్టి సాజిద మృతదేహాన్ని గుర్తించి బయటికు తీశారు. సాజిద మృతదేహాన్ని చూసి హెడ్ కానిస్టేబుల్ రసూల్ కుటుంబం భోరున విలపించింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కానిస్టేబుల్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎంపిపి చల్లా రాజశేఖర్ రెడ్డి, జడ్పిటిసి చల్లా శ్రీ లక్ష్మీతో కలిసి అవుకు రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. రసూల్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. రిజర్వాయర్‌లో బోటు బోల్తా పడడం అత్యంత బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హెడ్ కానిస్టేబుల్ రసూల్ తనకు చాలా సుపరిచితుడని, రసూల్ అన్న కూతురు ఆసియా బి, రసూల్ తమ్ముని భార్య నూర్జహాన్, రసూల్ కూతురు సాజిదాలు మృతి చెందడం విషాదకరమన్నారు. అవుకు రిజర్వాయర్ లో గతంలో ఎన్నడూ ఇటువంటి ఘటన జరగ లేదని, బోటు నడిపే వ్యక్తి సెలవులపై వెళ్లడంతో మరొక వ్యక్తి నడిపాడని, దురదృష్ట వశాత్తు బోటు బోల్తా పడి ముగ్గురు మృతి చెందడం బాధాకర మన్నారు. ముందు ముందు ఇటువంటి ఘటనలు తలెత్తకుండా సిఎం దృష్టికి తీసుకువెళ్లి పటిష్టమైన బోటింగును ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రసూల్ కుటుంబానికి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని చెప్పారు.

రసూల్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

అవుకు రిజర్వాయరు వద్ద హెడ్ కానిస్టేబుల్ రసూల్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి పరామర్శించారు. మృత్యువు బోటు రూపంలో వచ్చి ముగ్గురి ప్రాణాలను బలికొనడం రసూల్ కుటుంబానికి కోలుకోలేని దెబ్బ అని ఆయన విచారణ వ్యక్తం చేశారు. రసూల్ కుటుంబానికి తన అండదండలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు.

సాజిదా మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

భానుడు భగ భగ..

- సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదు
- బెంబేలెత్తిపోతున్న ప్రజలు

ప్రజాశక్తి - మహానంది

ఎండలు మండుతున్నాయి. ఉష్ణతాపం ఒక్కసారిగా పెరిగిపోయింది.. భానుడి ప్రతాపానికి జనం బెంబేలెత్తిపోతున్నారు. మహానంది మండలంలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 11 గంటలు దాటిన తర్వాత బయట అడుగుపెట్టేందుకు ప్రజలు భయపడుతున్న పరిస్థితి నెలకొంది. సోమవారం మహానంది మండలంలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ వేడి, ఉక్కపోతతో ప్రజలు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వినియోగిస్తుండడంతో విద్యుత్ వినియోగమూ పెరిగింది. సాయంత్రం ఎండ తీవ్రత తగ్గిన తర్వాత బయటకు వస్తున్నారు. మిగతా సమయాల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రావడం లేదు. మధ్యాహ్నం గాజులపల్లె-నంద్యాల జాతీయ రహదారి ప్రజలు, వాహనాలు లేక నిర్మానుష్యంగా మారింది. ప్రజలు ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానియాలను ఆశ్రయిస్తున్నారు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితి అయితేనే బయటకు వెళ్లాలని, వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న రహదారి

వందో రోజు జోరుగా..

- బండి ఆత్మకూరు మండలంలో యువగళం
- లోకేష్‌తో కలిసి నడిచిన భువనేశ్వరి

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర శ్రీశైలం నియోజకవర్గంలో జనసంద్రం నడుమ జోరుగా సాగింది. ఆదివారం రాత్రి బోయరేవుల గ్రామం దగ్గర బస చేసిన నారా లోకేష్ సోమవారం ఉదయం ఏడు గంటలకు పాదయాత్రను ప్రారంభించారు. వంద రోజులు పూర్తి చేసుకోవడంతో నారా లోకేష్ తల్లి నారా భువనేశ్వరి యువగళం పాదయాత్రలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మోత్కూరు గ్రామం వద్ద వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా పైలాన్ ఆవిష్కరించారు. శ్రీశైలం నియోజకవర్గం ఇంచార్జి బుడ్డా రాజశేఖర్ రెడ్డి, పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మాజీ మంత్రులు అమర్నాథ్ రెడ్డి, ప్రతాపరెడ్డి, భూమా అఖిల ప్రియ పాదయాత్రలో నడిచి వచ్చి పైలాన్ ఆవిష్కరణలో పాల్గొన్నారు. అనంతరం బండి ఆత్మకూరు మండలంలోకి ప్రవేశించిన పాదయాత్రకు తెలుగుదేశం పార్టీ ఐఆర్‌సి మాజీ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి, మహానంది ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ కంచర్ల సురేష్ రెడ్డి, తాటికొండ బుగ్గ రాముడు, తెలుగు యువత శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు మల్లేశ్వర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు నందిపాడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి సిద్ధయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున మహిళలు ఏకశిలా ఆంజనేయ స్వామి వద్ద ఘన స్వాగతం పలికారు. సంత జుటూరు గ్రామం మీదుగా ప్రజలతో అభివాదం చేస్తూ బస్టాండ్ వద్ద మహిళలతో పలకరిస్తూ ఉత్సాహంగా పాదయాత్ర సాగింది. అనంతరం మధ్యాహ్నం 42 చెంచు గూడెంల ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ముఖాముఖిలో బుడగ జంగం సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు తాటికొండ బుగ్గ రాముడు, పాటికొండ మహేష్, మద్దినేని శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న నారా లోకేష్

యువగళం పాదయాత్రలో లోకేష్ వెంట నడిచిన నారా భువనేశ్వరి

సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మహానంది

పేదల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. సోమవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి వైసిపి నాయకులు కొండా మధుసూదన్ రెడ్డి, గోపవరం సొసైటీ చైర్మన్ వడుగూరి రామకృష్ణుడు, మాదాసికురువ రిజర్వేషన్ పరిరక్షణ సమితి శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్ గజ్జ పెద్దపక్కీరయ్యలు ఘనంగా గజమాలతో సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. నాలుగేళ్ల పాలనలో అందించిన లబ్దిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు, తహశీసిల్దార్ జనార్దన్ శెట్టి, వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి, విద్యాశాఖ అధికారి రామసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, ఎంపీడీవో శివ నాగజ్యోతి, పంచాయతీ సెక్రెటరీలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో న్యాయం చేస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి చట్ట పరిధిలో న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి జిల్లా ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా సమస్యలపై జిల్లా ఎస్పీ సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్.రమణ, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి, సిఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

నిందితులను జైలుకు తరలింపు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో విలువైన స్థలాలకు నకిలీ లీగల్ హెయిర్, డెత్ సర్టిఫికెట్లను సృష్టిస్తున్న ముఠా సభ్యులు చవ్వ పవన్, తిరుమలయ్య, మౌలాలి, ఖాసిం, డాక్యుమెంట్ రైటర్‌లు సుమంత్, అస్లామ్, దాదాపీర్, నబీరసూల్‌లను అరెస్టు చేసి కర్నూలు జిల్లా జైలుకు తరలించినట్లు డిఎస్పీ సి.మహేశ్వర్ రెడ్డి సోమవారం తెలిపారు. వారికి ఈ నెల 29వ తేదీ వరకు రిమాండ్ ఇచ్చారన్నారు.

భూములు తీసుకుంటే జీవనోపాధి కోల్పోతాం

- కానాల రైతులు
- రైతులతో భూ సేకరణపై నేషనల్ హైవే అథారిటీ ఎడి చర్చ

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

167 కె జాతీయ రహదారి భూ సేకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గజిట్ మార్చాలని గత నెల రోజుల క్రితం నుండి కానాల, రైతు నగరం గ్రామాల రైతులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దశలవారిగా ఆందోళన నిర్వహిస్తున్నారు. సోమవారం భూములు కోల్పోతున్న రైతుల పొలాల వద్దకు నేషనల్ హైవే అథారిటీ అధికారిని ఎడి ఇందిరమ్మ, పోలీసు అధికారులు వచ్చి భూ సేకరణపై చర్చించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల రైతులు, రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన గజిట్ ప్రకారం భూ సేకరణ జరిగితే రెండు గ్రామాల్లోని పేద రైతుల భూములు కోల్పోయి జీవనోపాధి లేక ఆకలితో పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పేద రైతులకు నష్టం కలిగించని విధంగా ప్రత్యమ్నాయ భూముల్లో అలైన్మెంట్ చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఏడి సమస్యని నేషనల్ హైవే అథారిటీ ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పేద రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని, అంత వరకు సర్వే చేయుటకు అధికారులను కూడా పంపనని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భూ నిర్వాసిత కమిటీ నాయకులు శంకర్రావు, సుబ్బారావు, రామ చిన్నమ్మ, మనోహర్, వెంకటేశ్వర్లు, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు సిపిఎం పట్టణ కార్యదర్శి నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, నాయకులు బంగారు, డేవిడ్, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎడి ఇందిరమ్మ

స్పందన అర్జీదారులకు అన్నదానం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీదారులకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణుడు, రెడ్‌క్రాస్ సీనియర్ నాయకులు పేరుసోముల నరసింహమూర్తి, బత్తులూరు విజయ కాంత్ రెడ్డి తదితరుల సహకారంతో అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పి సిఇఒ సుబ్బారెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ మనోహర్, మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆనంద్, మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల హాజరై అర్జీదారులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరావు, సీనియర్ నాయకులు నాగేశ్వర రెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భోజనాలు వడ్డిస్తున్న డిఆర్డిఏ పిడి, ఇతర అధికారులు

టిడిపి విజయాన్ని ఎవరూ ఆపలేరు

- మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

రానున్న ఎన్నికల్లో టిడిపి విజయాన్ని ఎవరూ ఆపలేరని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు 100 రోజులు పూర్తయిన సందర్భంగా సంఘీభావంగా సోమవారం బనగానపల్లె మండలంలోని మీరాపురం గ్రామం నుండి యాగంటి దేవస్థానం వరకు మాజీ ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. మీరాపురం గ్రామం నుండి ప్రారంభమైన పాదయాత్రలో పాతపాడు గ్రామంలో గ్రామ సర్పంచి బెడదల మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు, ప్రజలు హారతులు పట్టి స్వాగతం పలికారు. పాదయాత్ర పూర్తయిన తర్వాత యాగంటి దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యే కేకును కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం, యువత ఉపాధి ఉద్యోగ అవకాశాల కోసం నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. పాదయాత్రకు విశేష స్పందన లభిస్తుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అఖండ విజయం సాధిస్తుందన్నారు. ఈ నెల 19వ తేదీ బనగానపల్లె నియోజకవర్గంలోకి నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభమవుతుందని కార్యకర్తలు, నాయకులు, ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి అంబాల రామకృష్ణారెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు కుమార్ రెడ్డి, ఎస్టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రమణా నాయక్, నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు కృష్ణా నాయక్, వాణిజ్య విభాగం పార్లమెంటు అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, తెలుగు యువత పార్లమెంటు అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, బిసి సెల్ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్, పాతపాడు, మిట్టపల్లె సర్పంచులు బెడదల మహేశ్వరరెడ్డి, తులసిరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మౌళీశ్వర రెడ్డి, నాయకులు రాయలసీమ సలాం, టిప్ టాప్ కలాం, మీరాపురం బాలిరెడ్డి, పసుపల బాల నాయుడు, షేక్షావలి, కామేష్, జోలాపురం గంధం హుసేని, తలారి తిరుమలయ్య, సాదుకోటం శ్రీనివాసరెడ్డి, మంగంపేట రమణా యాదవ్, కటికవానికుంట బాలరాజు యాదవ్, సుదర్శన్ యాదవ్, చిన్న రాజుపాలెం నరసింహులు, ఎర్రగుడి భాస్కర్ రెడ్డి, ఖాదర్ బాషా, పవన్ కుమార్ రెడ్డి, గాండ్ల ఉమా మహేశ్వరరావు, పాతపాడు సంకేశ్వర్ రెడ్డి, నందివర్గం వెంకటయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డికి హారతి పట్టి గజమాలతో సన్మానిస్తున్న మహిళలు

యాగంటికి పాదయాత్రగా వస్తున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, బాధితులు

దళితులకు భూములు చూపండి

- వ్యకాస ఆధ్వర్యంలో బాధితులు కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : మిడ్తూరు మండలంలోని పేద దళితులకు 1996లో ఇచ్చిన పట్టాలకు భూములు చూపించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నాగేశ్వరావు, సుధాకర్, మిడుతూరు మండల అధ్యక్షుడు టి.ఓబులేష్‌ల ఆధ్వర్యంలో బాధితులు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1996లో మిడుతూరు మండలం కేంద్రంలోని 40 కుటుంబాలు దళితులు, 6 బిసి కుటుంబాలకు అలగనూరు గ్రామం పోలిమేరలో పట్టాపాస్ పుస్తకాలు ఇచ్చారని, వాటిపై బ్యాంకులో, సొసైటీలో క్రాప్ లోను, సబ్సిడీ ద్వారా విత్తనాలు, ఎరువులు తెచ్చుకుంటున్నారని చెప్పారు. అయితే 27 సంవత్సరాల నుండి పట్టా పాస్ పుస్తకాలకు భూములు చూపాలని వచ్చిన ప్రతి తహశీల్దారును, ఆర్డీవోను కలిసి వినతి పత్రాలు ఇస్తున్నా మాటలతో కాలయాపన చేస్తున్నారని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ తహశీల్దారుతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని డిఆర్ఒను ఆదేశించారు. సుజ్ఞానం, జయరాముడు, ఏసన్న, తిరుపాలు, సుంకన్న, మద్దమ్మ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీని కలిసిన జడ్పిటిసి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డిని, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని అవుకు జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి సోమవారం గంగుల నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెతో పాటు చల్లా చైతన్య రెడ్డి, సాయినాథ్ రెడ్డి, విక్రాంత్ రెడ్డిలు ఉన్నారు.

సాగునీటితోనే కరువు నివారణ

ప్రజాశక్తి - మహానంది : రాయలసీమకు సాగునీరు, వనరులు ఇస్తే కరువు, వలసలు ఆగుతాయని రాయలసీమ స్టీరింగ్ కమిటీ జిల్లా నాయకులు యం.వి.రమణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గాజులపల్లిలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ సంతకాల సేకరణ నిర్వహించారు.

డెస్కులు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ఆర్ఎస్ రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతలు ఇచ్చిన డెస్కులను అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్‌లు డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

నూతన ఆరోగ్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - నందికొట్కూరు

నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా పట్టణంలో రూ. 4 కోట్లతో 33 పడకలతో నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని శాసన సభ్యులు తోగురు ఆర్థర్, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతి కౌన్సిలర్, లాలు ప్రసాద్‌లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ స్థల దాతలు కీర్తిశేషులు భద్రిశెట్టి కృష్ణమూర్తి, లక్ష్మి నర్సమ్మ దంపతు ల వారసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. హాస్పిటల్ విస్తరణ కోసం బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆధ్వర్యంలో సీయం జగన్ మోహన్ రెడ్డి కలిసి 100 పడకల హాస్పిటల్ నిర్మాణానికి కృషి చేయాలని విన్నవించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు చాంద్‌బాష, కాటెపోగు చిన్నరాజు, షేక్ నాయబ్, ఉమ్మడి జిల్లాల మైనారిటీ సెల్ జోనల్ ఇంఛార్జ్ అబూబక్కర్, శ్రీ నంది జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బద్దుల శ్రీకాంత్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు అబ్దుల్ జబ్బార్, వైసిపి నాయకులు ఉస్మాన్ బేగ్, బొల్లెద్దుల రామక్రిష్ణ, మార్కెట్ రాజు, కురువ శ్రీను, వి.ఆర్ శ్రీను, డి.రమేష్, ఎమ్మార్పీఎస్ కె.వి రమణ, ముస్లిం మైనార్టీ నాయకులు షకీల్ అహ్మద్, గోవింద రెడ్డి తదీతరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆర్థర్, మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

మళ్లీ వైసిపిదే అధికారం : జడ్పిటిసి

ప్రజాశక్తి -ప్యాపిలి

రాష్ట్రంలో 2024 ఎన్నికలలో మళ్ళీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుందని, డోన్‌లో వైసీపీ జెండా ఎగరేస్తామని జడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామ రెడ్డి,వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి,మాజీ జడ్పీటీసీ దిలీప్ చక్రవర్తి, సచివాలయ మండల కన్వీనర్ బోర మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నాలుగు సంవత్సరాలో నియోజ కవర్గం లో జరిగిన అభివృద్ధి ప్రతి గ్రామంలో తెలియ జేయాలన్న ఉద్దేశంతో ఏడు టీమ్‌లు ఏర్పాటు చేశామని ప్రతి గ్రామలలో ఈ టీమ్ లు పర్యటించి మంత్రి రాజేంద్ర నాథ్ రెడ్డి చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. రైతులకు సాగునీరు లేక కరువు నేల అని ఒక ఎకరాకు కూడా సాగునీరు అందక వర్షం మీద ఆధారపడే దుస్తుతి నుంచి విముక్తి చేసి అన్ని చెరువులకు నీళ్లు నింపే కార్యక్ర మం, డోన్‌లో నగర వనం, ఇండోర్ స్టేడియం, డోన్, ప్యాపిలి, బేతంచెర్లలో నూతన పార్కుల నిర్మాణం, డోన్‌లో వంద పడకల ఆసుపత్రి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సీమ సుధాకర్ రెడ్డి, బోరెడ్డి రాము,కమతం భాస్కర్ రెడ్డి, కృష్ణరెడ్డి,సీమ సుధాకర్ రెడ్డి,రామచంద్రరెడ్డి, ఎర్రిస్వామి, రాజమురళి, బాలయ్య, ధనుంజయ శెట్టి,చంద్రశేఖర్ రెడ్డి,చంద్ర, రామాంజి, సోమశేఖర్ పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మెరుగైన విద్యనందించడమే లక్ష్యం

- శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి
- ఘనంగా శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - నంద్యాల

నూతన విద్యా విధానంలో విద్యార్థులకు మెరుగైన విద్యా ప్రమాణాలు అవలంభిస్తూ ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి అన్నారు. సోమవారం గోస్పాడు మండలం బాబానగర్‌లో శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎపి మార్క్ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ఆలయ అర్చకులు, శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్లు పి.మౌలాలి రెడ్డి, పి.షేక్షావలి రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలను స్థాపించి విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చేందుకు పాటుపడుతున్నామని చెప్పారు. నూతన విద్యా విధానాలను అవలంభిస్తూ మరింత విద్యా ప్రమాణాలతో శ్రీ గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్ నెలకొల్పుతున్నామని తెలిపారు. అనంతరం పిపి నాగిరెడ్డి మాట్లాడుతూ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ స్థాయి పాఠశాలను ఏర్పాటు చేస్తున్న విద్యా సంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. గోస్పాడు మండలం పరిధిలో కార్పొరేట్ స్థాయి విద్యా విధానంతో గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్‌ను నెలకొల్పడం ఆనందంగా ఉందన్నారు. డైరెక్టర్ మౌలాలి రెడ్డి మాట్లాడుతూ శ్రీ గురురాజ ఇంటర్నేషనల్ పాఠశాల యాజమాన్యం నూతన ఒరవడిని సృష్టించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ గురు రాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, నంద్యాల పట్టణ ప్రముఖులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న దస్తగిరి రెడ్డి దంపతులు

బోటు బోల్తా దిగ్భ్రాంతికి గురి చేసింది

- మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

అవుకు రిజర్వాయర్‌లో బోటు బోల్తా పడిన ఘటన తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. సోమ వారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో సాజిద భౌతికకాయం వద్ద బిసి రాజారెడ్డి నివాళి అర్పించారు. బాధిత కుటుంబ పెద్ద స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ రసూల్‌ను పరామర్శించి ప్రమాద సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పాలని రసూల్‌కు ఆయన సూచించారు. ఆయన వెంట టిడిపి ముస్లిం ముస్లిం మైనార్టీ నియోజకవర్గం అధ్యక్షులు రాయలసీమ సలాం, నుసి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మృతదేహాలకు నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి

మిట్టకందాలలో చోరీ

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని మిట్టకందాలలో రూ.ఆరు లక్షలు, రెండు తులాల బంగారు చోరీ జరిగిన్నట్లు పాములపాడు ఎస్సై అశోక్ తెలిపారు. మిట్ట కందాల గ్రామానికి చెందిన నల్లగొండ వేంకటేశ్వర్లు ఇంట్లో సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.6 లక్షల నగదు, 2 తులాల బంగారు దొంగలించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బహుమతులతో గెలుపొందిన జట్లు

ముగిసిన సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని చిన్న కంబలూరు గ్రామంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను గ్రామ పెద్దలు జంగా చిన్న పుల్లారెడ్డి, పోశం లక్ష్మీకాంత్ రెడ్డిలు ప్రదానం చేశారు. 48 జట్లు పాల్గొనగా 4 జట్లు విజేతలుగా నిలిచాయి. మొదటి విజేతకు దాత సంజీవ లయన్స్ మురళీధర్ రెడ్డి రూ.30 వేలు, రెండవ విజేతకు దాత చిన్న కంబలూరు జంగా బ్రదర్స్, ముస్సాని బ్రదర్స్ రూ.20 వేలు, మూడవ విజేతకు దాత మహదేవపురం పోషం లక్ష్మీకాంతరెడ్డి రూ 10 వేలు, నాలుగవ విజేతకు దాత మాచినేని పల్లె ఎడవల్లి ప్రసాద్ రూ.5 వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి, బాలీశ్వర రెడ్డి, భూపాల్ రెడ్డి, రమేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిపై తిరుగుబాటు మొదలైంది : భూమా

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరే కతే కాకుండా తిరుగుబాటు మొదలైందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం 100 రోజుల పాదయాత్ర పూర్తి చేసుకున్న సందర్భంగా చాగలమర్రి పట్టణంలో సంఘీభావ పాదయాత్ర చేపట్టారు. గాంధీ సెంటరుకు చేరుకున్నాక గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం కేక్ కట్ చేశారు. టిడిపి ఆళ్లగడ్డ పరిశీలకులు శివుడు యాదవ్, తెదేపా మైనార్టిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్సర్ బాషా,మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి,టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావ పాదయాత్రలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

సంఘీభావ పాదయాత్రలో ధర్మవరం సుబ్బారెడ్డి

రాష్ట్రంలో అరాచక పాలన : టిడిపి

ప్రజాశక్తి -బేతంచెర్ల

రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అరాచక పరిపాలనను అంతమొందించడమే లక్ష్యం అని డోన్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి, బేతంచెర్ల మండల కన్వీనర్ వున్నం ఎల్ల నాగయ్య, టిడిపి అబ్జర్వర్ కాటమయ్య అన్నారు. యువగళం పాదయాత్ర వంద రోజులకు చేరుకున్న సందర్భంగా సోమవారం నాడు ఆర్ఎస్ రంగాపురం నుండి శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వరకు మండలం కన్వీనర్ ఉన్నము ఎల్ల నాగయ్య, షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి, కాటమయ్య, ఎల్లయ్య మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్రకు అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. అనంతరం పాదయాత్ర ముగిసిన తర్వాత శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్ర మంలో బేతంచర్ల పట్టణ కార్యదర్శి షేక్షావల్లి చౌదరి, తిరుమలేశ్ చౌదరి, సుధాకర్ చౌదరి, సిమెంట్ నగర్ రాముడు, లోడ్డ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భారత ప్రభుత్వం
పర్యావరణం, అడవులు & వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ
ఇంటిగ్రేటెడ్ రీజినల్ ఆఫీస్, విజయవాడ
గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ - 520010, ఆంధ్రప్రదేశ్ ఈమెయిల్: iro.vijavawada-mefcc@gov.in
F.No. 4-APC181/2022-VIJ/600 Date 7th February, 2023

దిగువ తెలిపిన వానికి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి,పర్యావరణం, అడవులు, సైన్స్ & టెక్నాలజీ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రూమ్‌నెం.268, 1వ అంతస్తు, 4వ బ్లాక్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, వెలగపూడి, అమరావతి, గుంటూరు జిల్లా- 522503

విషయం: మెస్సర్స్ హిమాచల్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ పేరున కర్నూలు జిల్లా, పాణ్యం మండలంలోని పిన్నాపురం పంప్డ్ స్టోరేజి ప్రాజెక్ట్ (పిఎస్‌పి) కి గోరకల్లు రిజర్వాయర్ నుండి ఇంటిగ్రేటెడ్ కారిడార్ (ట్రాన్స్‌మిషన్ లైన్, వాటర్ పైప్ నెట్‌వర్క్ మరియు రోడ్డు వేయుట) నిర్మాణం కోసం కర్నూలు డివిజన్, గని ఆర్ఎఫ్ యొక్క కంపార్ట్‌మెంట్ నెం.93, 94,106,111,112,113 & 114 లోని 12.58 హెక్టార్ల అటవీ భూమి మళ్ళింపునకు సంబంధించి

సర్!

పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం అటవీ (సంరక్షణ) చట్టం, 1980లోని సెక్షన్ 2కు అనుగుణంగా అటవీ భూమి మళ్ళింపు కొరకు కేంద్రప్రభుత్వం యొక్క ముందస్తు ఆమోదం కోరేందుకు రాష్ట్ర ప్రభుత్వ లేఖ నం.1486/సెక్షన్-2 /2022/ (1764447), తేది: 01.07.2022 మరియు ఆన్‌లైన్ ప్రతిపాదన నం.ఎఫ్‌పి/ఏపి/అధర్స్/ 153264/2022 రిఫర్ చేయటం అయినది. 27.07.2022 నాటి లేఖ ద్వారా కేంద్ర ప్రభుత్వ సూత్రప్రాయ ఆమోదం (స్టేజి-1)లభించింది. రాష్ట్ర ప్రభుత్వ లేఖ నం.1486/సెక్షన్-2 /2022/ (1764447), తేది: 27.01.2023 ద్వారా ఆమోదంలో నిర్దేశించిన షరతులకు అనుగుణంగా వున్నట్లు తెలిపింది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన మరియు రీజినల్ ఎంపవర్డ్ కమిటీ(ఆర్ఇసి) సిఫార్సును క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత, దిగువ తెలిపిన నిబంధనలకు లోబడి మెస్సర్స్ హిమాచల్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ పేరున కర్నూలు జిల్లా, పాణ్యం మండలంలోని పిన్నాపురం పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్(పిఎస్‌పి)కు గోరకల్లు రిజర్వాయర్ నుండి ఇంటిగ్రేటెడ్ కారిడార్ (ట్రాన్స్‌మిషన్ లైన్, వాటర్ పైప్ నెట్‌వర్క్ మరియు రోడ్డు వేయుట) నిర్మాణం కొరకు కర్నూలు జిల్లా, గని ఆర్ఎఫ్ లోని కంపార్ట్‌మెంట్ నంబర్లు: 93,94,106,111,112,113 & 114లోని 12.58 హెక్టార్ల అటవీ భూమి మళ్ళింపు కోసం అటవీ (సంరక్షణ) చట్టం 1980లోని సెక్షన్ 2 క్రింద కేంద్రప్రభుత్వం యొక్క సూత్రప్రాయ ఆమోదం (స్టేజి -2) ను నేను తెలియజేస్తున్నాను.

1)మళ్ళించబడిన అటవీ భూమి యొక్క న్యాయపరమైన స్టేటస్‌లో మార్పు ఉండదు.
2)యూజర్ ఏజెన్సీ యొక్క ఖర్చుతో 20 మీటర్ల నిడివితో తగు విధంగా నంబర్లు వేయబడిన 4 అడుగుల ఎత్తుగల కాంక్రీట్‌పిల్లర్లు నెలకొల్పడం ద్వారా ప్రతిపాదిత అటవీ భూమి యొక్క డీమార్కేషన్ చేపట్టాలి.
3) యూజర్ ఏజెన్సీ ఖర్చుతో కర్నూలు జిల్లా, పాణ్యం మండలం, పాణ్యం గ్రామంలోని సర్వేనెంబర్లు 1830 , 1836, 1835, 1828/పార్ట్, 1828/1 పార్ట్, 1828/2, 1829/పార్ట్ మరియు 1827లోని 12.75 హెక్టార్లు (బిట్-1 - 4.51 హెక్టార్లు మరియు బిట్-2: 8.24 హెక్టార్లు) విస్తీర్ణంలో రాష్ట్ర అటవీ శాఖ అవసరమగు సిఏ కార్యకలాపాలు చేపట్టాలి.
4) కేంద్ర ప్రభుత్వం యొక్క ముందస్తు ఆమోదం లేకుండా సిఏ పథకం కొరకు గుర్తించబడిన అటవీయేతర ప్రాంతం మార్చకూడదు. సిఏ భూమి తగు విధంగా డీమార్కేట్ చేయవలెను మరియు అతిక్రమణలను నివారించేందుకు అటవీ శాఖకు అటవీయేతర భూమి బదిలీకి సంబంధించి స్థానిక గ్రామస్తులకు తగినంతగా సమాచారం ఇవ్వవలెను.
5) మళ్ళించిన అటవీ భూమి యొక్క నికర ప్రస్తుత విలువగా అదనపు మొత్తం భవిష్యత్తులో గౌరవ భారత సుప్రీమ్ కోర్టుచే అది తగు విధంగా సవరించబడిన తరువాత, యూజర్ ఏజెన్సీ నుండి రాష్ట్ర ప్రభుత్వంచే ఛార్జ్ చేయబడును. యూజర్ ఏజెన్సీ దీనికి సంబంధించి అండర్ టేకింగ్ దాఖలు చేయాలి.
6) యూజర్ ఏజెన్సీ గోరకల్లు రిజర్వాయర్ నుండి నీటిని లిఫ్టింగ్ చేసే ముందు వన్యప్రాణుల ఉపశమన ప్రణాళికను తయారు చేసుకుని, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్‌చే తగువిధమైన ఆమోదాన్ని పొందవలెను. రాష్ట్ర అటవీ శాఖ వారు దానిని యూజర్ ఏజెన్సీ ఖర్చుపై అమలు చేయవలెను. దీనికి సంబంధించిన అండర్‌టేకింగ్ యూజర్ ఏజెన్సీచే దాఖలు చేయబడాలి.
7)మళ్ళింపు కోసం ప్రతిపాదించిన అటవీ భూమిని ఎట్టి పరిస్థితులలోనూ కేంద్ర ప్రభుత్వం ముందస్తు ఆమోదం లేకుండా ఏదేని ఇతర ఏజెన్సీకి, శాఖకు లేదా వ్యక్తికి బదిలీ చేయరాదు లేదా అద్దెకు ఇవ్వరాదు.
8)అటవీ శాఖ కఠినమైన పర్యవేక్షణలో అవసరమైన చోట చెట్ల నరికివేతను చేపట్టాలి.
9)యూజర్ ఏజెన్సీ 33 కె.వి. సామర్థ్యం గల ప్రతిపాదిత ట్రాన్స్‌మిషన్ లైన్ కోసం ప్రామాణిక దారి హక్కును పాటించవలెను.
10) యూజర్ ఏజెన్సీ ప్రాజెక్ట్ ఖర్చులో సంబంధిత డిఎఫ్ఓను సంప్రదించడం ద్వారా అవసరమైన చోట రీటెయినింగ్ వాల్స్ మరియు చెక్ వాల్స్ నిర్మించాలి.
11) సహజ సిద్ధంగా ఏర్పడిన వాగులు/ నదులు/ కాలువలపై ఏదైనా కల్వర్ట్‌లు/వంతెనల నిర్మించిన యెడల, నీటి సహజ ప్రవాహ మార్గానికి అడ్డంకి గాని, నీటిని నిలువ ఉంచని మరియు వన్య జీవుల రాకపోకలకు అడ్డంకి కాని విధానంలో చేపట్టవలెను.
12) త్రవ్విన మెటీరియల్ / ఓవర బర్డెన్‌గా మారిన వాటిని అటవీ ప్రాంతానికి వెలుపల పారవేయవలెను. అటవీ ప్రాంతంలో ఎటువంటి మెటీరియల్‌ను నిల్వ చేయరాదు.
13) ప్రతిపాదన యొక్క లేఔట్ ప్లాన్‌ను కేంద్ర ప్రభుత్వం యొక్క ముందస్తు ఆమోదం లేకుండా మార్చరాదు.
14) యూజర్ ఏజెన్సీ చెట్ల నరికివేతను నివారించేందుకు సైట్‌లో పని చేసే కార్మికులను వంట చెరకును ముఖ్యంగా ప్రత్యామ్నాయ ఇంధనాన్ని ఏర్పాటు చేయాలి మరియు అటవీ ప్రాంతం లోపల లేబర్ క్యాంప్‌ను ఏర్పాటు చేయరాదు.
15) వీలైనంత మేరకు అటవీ ప్రాంతం వెలుపల కార్మిక శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆటంకం కనిష్టంగా ఉంచబడును మరియు పని నిర్వహణలో నిమగ్నమైన కార్మికులను మరియు సిబ్బందిని సమీపంలోని అటవీ వృక్షజాలం మరియు జంతుజాలాన్ని నాశనం చేయకుండా ఉండేలా చూసుకోవడం యూజర్ ఏజెన్సీదే బాధ్యత.
16) ప్రాజెక్టుకోసం వినియోగించిన మొత్తం అటవీ ప్రాంతం 12.58 హెక్టార్లకు మించకూడదు మరియు మళ్ళించిన అటవీ విస్తీర్ణం మళ్ళింపు ప్రతిపాదనలో చూపినది కాకుండా మరే ఇతర అవసరం నిమిత్తం ఉపయోగించరాదు.
17) ప్రాజెక్ట్ పని నిర్వహణకు నిర్మాణ మెటీరియల్స్ రవాణా కోసం అటవీ ప్రాంతం లోపల ఎలాంటి అదనపు లేదా కొత్తం మార్గం నిర్మించకూడదు.
18) ప్రాజెక్ట్‌కు వర్తించే ప్రస్తుతానికి అమలులో వున్న అన్ని చట్టాలు, నియమాలు, నిబంధనలు మరియు మార్గదర్శకాలను యూజర్ ఏజెన్సీ మరియు రాష్ట్రప్రభుత్వం పాటించాలి.
19) ప్రాంతంలోని జంతుజాలం మరియు వృక్షజాలం సంరక్షణ మరియు నిర్వహణ, అడవుల పెంపకం ప్రయోజనంలో కేంద్ర ప్రభుత్వం లేదా ప్రాంతీయ అధికారి (సెంట్రల్), ఇంటిగ్రేటెడ్ రీజనల్ ఆఫీస్, విజయవాడ వారు కాలానుగతంగా విధించే ఏవేని ఇతర నిబంధనలను యూజర్ ఏజెన్సీ పాటించాలి.
20)పైన తెలిపిన ఏవేని నిబంధనలను పాటించడంలో విఫలమైతే ఎఫ్‌సిఏ, 1980 క్రింద జారీ చేయబడిన నియమాలు/ మార్గదర్శకాలలోని ప్రొవిజన్ల ప్రకారం యూజర్ ఏజెన్సీ పై చర్య తీసుకొనబడును.

మీ విశ్వాసపాత్రుడు
సం/- (ఎన్.ఎస్.మురళి)
ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్స్ (సెంట్రల్)

ఈ-స్టాంపింగ్ సేవలను నియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఈ - స్టాంపింగ్ సేవలను ప్రజలు వినియోగించు కోవాలని సబ్ రిజిస్టర్ అబ్దుల్ సత్తార్ తెలిపారు. సోమ వారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అగ్రిమెంట్లు, అఫిడవిట్లు, దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం నాన్ జుడీషియల్ స్టాంపు పేపర్లు బదులుగా ఈ స్టాంపింగ్ విధానాన్ని ఇటీవలే ప్రవేశపెట్టిం దన్నారు. ఈ-స్టాంపింగ్ విధానంలో కూడా ప్రజలు తమకు అవసరమైన నాన్ జూడీసియల్ స్టాంపులను పొందవచ్చున్నారు. ఈ-స్టాంపింగ్ ద్వారా వేయబడిన స్టాంపులు, సాధారణ నాన్ జూడీసియల్ బాండ్ పేపర్లతో సమానంగా చలామణి అవుతాయని, వీటిని దస్తావేజుల రిజిస్టర్ నిమిత్తం కూడా నిరభ్యంతరంగా వాడు కోవచ్చున్నారు. ఈ-స్టాంపింగ్ ద్వారా స్టాంపుల అమ్మకం, లైసెన్సుల కోసం అర్హత కలిగిన ప్రజలు దరఖాస్తు చేసుకుంటే స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ వారు వెంటనే లైసెన్సులు మంజూరు చేస్తున్నారన్నారు. పైగా దస్తావేజులను నాన్ జుడిషియల్ స్టాంపుల మీద రాసుకున్న, ఈ-స్టాంపింగ్ ద్వారా ముద్రలు పొందిన రిజిస్ట్రేషన్కు అనుమతించేలా తమకు మార్గదర్శకాలు వచ్చాయన్నారు. ఈ స్టాంపింగ్ విధానం ఎంతో సురక్షితమైనదని తెలిపారు.

అనాధ ఆశ్రమానికి నిత్యవసరాలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

పట్టణం లోని నంద్యాల రోడ్డులో గల అన్నపూర్ణ అనాధ ఆశ్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షులు వలి బాష కమిటీ బృందం నిత్యవసర సరుకులను సోమవారం నాడు పంపిణీ చేసింది. వలి బాష మాట్లాడుతూ లైయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనాధ ఆశ్రమానికి తమ వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్‌సభ్యులు రాజు,మహేష్, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ట్రై సైకిల్ పంపిణీ

ప్రజాశక్తి - చాగలమర్రి

పట్టణంలోని చిన్న మకానం వీధికి చెందిన వికలాంగుడైన పాపోడుకు బాబులాల్ యువసేన సభ్యులు ఉచితముగా ట్రై సైకిల్‌ను, రూ. 100 నగదును పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తపల్లి

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ అన్నారు. సోమవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ పంచాయతీలో ఉన్న చదరం పెంట, ఎర్రగుంట్ల చెంచుగూడెంలలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గిరిజ నులు సమస్యలు వివరించారు. సమస్యలను పరిష్క రించాలని అధికారులకు ఆదేశించారు. ఎంపీడీవో మేరీ, తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఈవోఆర్‌డి శ్రీనివాసులు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చెంచు మహిళలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే

మరదలిపై దాడి

- కేసు నమోదు

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని రాంపల్లె గ్రామ పొలిమేరలోని పొలాల్లో కాటసాని రఘునాథరెడ్డి అతనికి స్వయాన మరదలైన ప్రభావతమ్మపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడిన ఘటనలో వివిధ సెక్షన్లపై కేసు నమోదు చేశామని ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య వెల్లడించారు. చాగలమర్రి పోలీసు స్టేషన్లో సోమవారం డీఎస్పీ సమావేశాన్ని ఏర్పాటు చేసి కేసు వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కాటసాని రఘునాథరెడ్డి అతనికి స్వయాన మరదలైన ప్రభావతమ్మ మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయన్నారు. సోమవారం పొలం వద్దకు వచ్చి ప్రభావతమ్మతో రఘునాథరెడ్డి మాటామాటా పెంచుకుని తీవ్ర పదజాలంతో దూషిస్తూ విచక్షణ రహితంగా జుట్టు పట్టుకుని కాళ్ల చెప్పుతో కొట్టడం జరిగిందన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎస్సై రమణయ్య ఘటనా స్థలానికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజశేఖర్రెడ్డి, ఎస్సై రమణయ్య పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య

విద్యుత్ సిమెంటు పోల్స్ ఏర్పాటు

ప్రజాశక్తి-డోన్

పట్టణంలోని 11వ వార్డులో ప్రజలకు విద్యుత్ కి సంబంధించి 8 ఐరన్ పోల్స్ సమస్య ఉండేదని, వాటిలో 5 ఐరన్ పోల్స్‌ను ప్రస్తుతం తొలగించి వాటి స్థానంలో విద్యుత్ సిమెంటు పోల్స్‌ను సోమవారం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ డోన్ పట్టణంలో ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ నిధుల నుంచి 73 సిమెంట్ పోల్స్‌ను శాంక్షన్ చేయడం జరిగిందన్నారు. వార్డులలో సమస్యలను తెలుసుకొని ప్రజలకు ఇబ్బందులు ఉండేటివి ఒక్కొక్కటిగా పరిష్కరిం చుకుంటూ ముందుకు వెళ్తున్నాం అన్నారు. అనంతరం విద్యుత్ సిమెంటు పోల్స్‌ను పనులను ప్రత్యేకంగా పరిశీలించారు.

పోల్స్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ సప్తశైల రాజేష్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - రుద్రవరం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని చలమ రేంజి, పెద్ద కంబలూరు సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు నాయుడు, నూతల సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పెద్ద కంబలూరు గ్రామంలో సిబ్బంది నాగప్పతో కలిసి పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే రుద్రవరం రేంజ్ నూతల సెక్షన్‌లోని నరసాపురం గ్రామంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా నూతల సెక్షన్ సిబ్బంది నాగేంద్రయ్య,రామకృష్ణ, వేంకటేశ్వర రెడ్డి, ప్రొటెక్షన్ వాచర్లు, దానమయ్య, సుధాకర్ నర్సాపురం గ్రామంలో పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలకు సూచించారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికా రిని మద్దమ్మ విద్యార్థులను సూచించారు. సోమవారం పగిడ్యాల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని మాట్లాడారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో ఇంటి దగ్గర ఉండకుండా గ్రంథా లయ వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొనాలని ఆమె కోరారు. విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్, లెక్కలు బోధించడం జరిగిందన్నారు. క్రికెట్టు, చెస్ , క్యారమ్స్ ఆటలను ఆడించడం జరిగిందని ఆమె తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నంద్యాల

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రఘురామమూర్తి, పి.సుంకయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధ సంఘం రాష్ట్రవ్యాప్తి పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేంద్ర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చిత్తశుద్ధితో భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కరించాలని, లేకుంటే 2024లో ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీ డి.శివ బాలకృష్ణ, డోన్ అధ్యక్షులు పుల్లయ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు , భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల పట్టణం శ్రీ శేషారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఎంఈఎఫ్ నాయకులు జోల్లు మధుసూదన్, ముత్యాల ఎల్లయ్య నీళ్లతో కడిగి శుభ్రపరచి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు జొల్లు మధుసూదన్ మాదిగ, మండల కార్యదర్శి ముత్యాల ఎల్లయ్య మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మధు, నరేష్, శివా, తదితరులు పాల్గొన్నారు.